క్లుప్తంగా

సీఎం అభినందన



గార్ల: గార్ల మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ గుడిచుట్టు నవీన్‌యాదవ్‌ను గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడానికి అహర్నిషలు కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు అభినందనలు తెలిపారు.

గొడుగుల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: భగవాన్ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకుని జీవించే పేదలకు గురువారం గొడుగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రదీప్, రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం



నెల్లికుదురు: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలని బాధితులు తహసీల్దార్ రాజుకు గురువారం ఫిర్యాదు చేశారు. బాధితులు బండి సోమయ్య, మైస రాములు మాట్లాడుతూ.. మండలంలోని రామన్నగూడెం గ్రామ పరిదిలోని 32 సర్వే నంబర్‌లో 1998లో అప్పటి ప్రభుత్వం సుమారు 3ఎకరాల భూమి కొనుగోలు చేసిందని తెలిపారు. గ్రామంలోని నిరుపేదలు ఇళ్ల నిర్మాణానికి పట్టాలు పంపిణీ చేసిందన్నారు. పట్టాలు ఇచ్చి ప్లాట్లు చూపెట్టకపోవడంతో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉందన్నారు. ఆదే అదనుగా చేసుకున్న గ్రామానికి చెందిన పాశం భాగ్యమ్మ భర్త వీరయ్య ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'తాగునీటి ఎద్దడిని తీర్చాలి' అనే శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మండలంలోని దేశ్యాతండా, మంగలితండా ఎస్టీ కాలనీలో రక్షిత మంచినీటి పథకాల మోటార్లు, స్టార్టర్లకు పంచాయతీ అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి ఈ గ్రామాల ప్రజలకు మిషన్ భగీరథ నీటితోపాటు మంచినీటి పథకాల ద్వారా తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: గ్రూప్–1, సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ 2024–25 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల నుంచి ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నర్సింహారావు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పీవీ ప్రసాద్ గురువారం తెలిపారు. హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3వ తేదీల్లో గ్రూప్–1 ప్రిలిమ్స్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. అలాగే ఈ నెల 23, 26, 28, 30, జూన్ 10, 12, తేదీల్లో హైదరాబాద్‌లోని సైదాబాద్ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 040 27077929, 24071178 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

కేసముద్రం: మండలంలోని బేరువాడ గ్రామంలో హనుమాన్ మాలధారులు హనుమాన్ శోభాయాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంతోష్, సుధాకర్, భీమానాయక్, సంజయ్ పాల్గొన్నారు.

హనుమ ఆశీస్సులు పొందండి

మహబూబాబాద్ రూరల్: హనుమాన్ మాల ధారణ స్వీకరించి భక్తులు హనుమంతుడి ఆశీస్సులు పొందాలని ఆంజనేయ స్వామివారి దేవాలయ ప్రధాన అర్చకులు దాసరోజు సందీప్ శాస్త్రి అన్నారు. హనుమాన్ మాలవేయండి..హనుమ ఆశీస్సులు పొందండి అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం మొదలుపెట్టారు.

మామిడి రైతుకు దళారుల బెడద

- క్వింటా కాయలకు 10కేజీల తరుగు
- ముందస్తు చెల్లింపుల పేరుతో రూ.100కు రూ.10 కటింగ్
- ప్రత్యామ్నాయం లేక దళారులకు అమ్ముతున్న రైతులు



దంతాలపల్లి మార్కెట్

దంతాలపల్లి: అరుగాలం కష్టపడి గాలి, వానలకు నష్టపోయి మిగిలిన మామిడి కాయలను మార్కెటుకు తీసుకువస్తే, దళారుల చేతిలో మోసపోయి తక్కువ ధరకు అమ్ముకొని మామిడి రైతులు నష్టపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఏమి చేయలేమని చోద్యం చూస్తున్నారు దంతాలపల్లి మండల కేంద్రం సూర్యాపేట్, ఖమ్మం, వరంగల్ జనగాం జిల్లాలకు మధ్యలో ఉండడం వలన మహబూబాబాద్ జిల్లాతో పాటు ఈ నాలుగు జిల్లాల మామిడి రైతులు కాయలను విక్రయించడం కోసం మండల కేంద్రానికి తీసుకువస్తారు. ఇక్కడి నుంచి ఢిల్లీ, గుజరాత్, పంజాబ్, రాజస్తాన్, తదితర రాష్ట్రలకు ఎగుమతి అవుతాయి. నిర్వాహకులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొనుగోలుదారులతో కుమ్మక్కై వేలి సైగలతోనే ధర నిర్ణయిస్తున్నారు. దీనికి తోడు క్వింటా కాయలకు 10కేజీల తరుగు, ముందు చెల్లింపుల పేరుతో 100కు 10 రూపాయల చొప్పున కట్ చేసి 5నుంచి 10 రోజుల మధ్యలో రైతుకు డబ్బులు చెల్లిస్తున్నారు. జిల్లాలో మామిడి పంట దాదాపు 16వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రైతులు కోసిన కాయలను అమ్ముకోవడానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేకపోవడంతో దళారుల చేతిలో మోసపోక తప్పడంలేదు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోపోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం స్పందించి, మామిడి రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా, మార్కెట్‌ను సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నడిపించే విధంగా చూడాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలి



మార్కెట్ నిర్వాహకులు నిర్ణయించే ధర బాధ కలిగిస్తోంది. మామిడి కాయలు పచ్చి సరుకు కావడంతో రైతులు ఎక్కడికి వెళ్లరనే నమ్మకంతో ఇష్టం వచ్చినట్లు నిర్వహిస్తున్నారు. రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలి.

– జాటోత్ సందీప్, మామిడి రైతు, దుబ్బతండా

చర్యలు తీసుకుంటాం..



మామిడి కాయలు ఎక్కువ రోజులు ఉండవు. కాబట్టి ప్రస్తుతం ఏమి చేయలేము. రైతులు పంటను తమ ఇష్టం వచ్చిన ధరకు ఇష్టం వచ్చిన చోట అమ్ముకోవచ్చు. రైతులు తమకు జరిగిన అన్యాయం చెప్పితే చర్యలు తీసుకుంటాం.

– నిరంజన్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ

19నుంచి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన లక్ష్మీనారాయణుడి ఆలయం
- 23న స్వామివారి తిరుకల్యాణోత్సవం



ముస్తాబైన లక్ష్మీనారాయణస్వామి ఆలయం

గూడూరు: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీ నారాయణస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతీయేట వైశాఖ శుద్ధ ఏకాదశి మొదలుకొని బహుళ విధియ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగ వస్తోంది. దశాబ్దాల కాలంగా ఈ ఆలయానికి మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు ఏపూరి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా, ప్రస్తుతం వారి కుమారుడు ఏపూరి శ్యాంసుందర్‌రెడ్డి కొనసాగుతున్నారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ వెల్లడించారు. మే 19వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు తొల్లక్కం కార్యక్రమంతో అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుడతారు. 20 వ తేదీ సోమవారం రాత్రి 8 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, 21న పరమపదోత్సవం, 22న నృసింహ జయంతి వేడుకలు, సాయంత్రం విశ్వక్సేనారాధనతో బ్రహ్మోత్సవాలు ఆరంభం. సాయంత్రం ధ్వజారోహణం, బలిహరణ, గరుడముద్ద, 23 వ తేదీ ఉదయం సుదర్శనయాగం, సాయంత్రం 6గంటలకు ఎదుర్కోళ్లు, రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంపై లక్ష్మీనారాయణస్వామి తిరుకల్యాణోత్సవం కనుల పండువలా నిర్వహిస్తారు. 24న హనుమాన్ శోభాయాత్ర, బండ్లు తిరుగుట, అశ్వ వాహనంపై స్వామి వారి ఊరేగింపు, 25వ తేదీ శనివారం ఉదయం దోపు సేవ, అనంతరం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం ఆ తరువాత గూడూరు సమీప పాకాలవాగులో చక్రతీర్థం నిర్వహిస్తారు. తిరిగి సాయంత్రం పన్నెండు శావలతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతారు. వారం రోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు గూడూరు, కేసముద్రం, నెక్కొండ, కొత్తగూడ, నర్సంపేట, వరంగల్ నుంచి కూడా భక్తులు హాజరై స్వామి దీవెనలు పొందడం విశేషం.

బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టొద్దు



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గార్ల: మిషన్ భగీరథ పైప్‌లైనుపై డబుల్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టరాదని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. గార్ల నుంచి చిన్నబంజర తండా వరకు రూ.14కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణం కింద నుంచి మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైను ఉందన్నారు. ఇటీవల ఈ రోడ్డు వెడల్పు చేసే సమయంలో 2చోట్ల పైప్‌లైను దెబ్బతిని 2రోజులు పైగ్రామాల ప్రజలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నందున, మిషన్ భగీరథ పైప్‌లైను నిర్మాణ స్థలంలో కాకుండా రోడ్డును కుడివైపు వెడల్పు చేస్తే బాగుంటుందని తెలిపారు. లేని ఎడల లీకై న ప్రతిసారి రోడ్డును ధ్వంసం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ధర్నా అనంతరం ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీపీ బట్టు నాగరాజులకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు పెద్దవెంకటేశ్వర్లు, హరినాయక్, గోవింద్, నాగమణి, లోకేశ్వరరావు, ఉపేందర్‌రెడ్డి, రామకృష్ణ, కొండయ్య, వీరభద్రం, అశోక్, లచ్చయ్య పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ



గూడూరు: అయోధ్యపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మహబూబాబాద్ రూరల్: డెంగీ దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



గార్ల: ముల్కనూరు పీహెచ్‌సీలో..



దోర్నకల్ పీహెచ్‌సీలో..

గూడూరు: ప్రతీ ఒక్కరు ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ దోమలను అరికట్టాలని, డెంగీ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ యమున సూచించారు. మండలంలోని అయోధ్యపురంలో గురువారం ప్రాథమిక ఆసుపత్రి ఆధ్వర్యంలో డెంగీ నివారణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది సీతమ్మ, లవరాం, లోక్యానాయక్, కోమల పాల్గొన్నారు.

డోర్నకల్: డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి రాజుతండా వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సాధ్విజ మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు జానకిదేవి, లావణ్య, స్వరాజ్యం, సూపర్‌వైజర్లు విజయకుమారి, విజయలక్ష్మి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వీ మాట్లాడుతూ.. ఇళ్లలో ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లలో, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి గుంటల్లో నీటినిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. ర్యాలీలో డాక్టర్ నవీన్‌కుమార్, సీహెచ్‌ఓ సక్కుబాయి, హెచ్‌ఈఓ శ్రీహరి, హెచ్‌ఎస్‌లు ఇస్మాయిల్, రాధాకృష్ణ, బుజ్జమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి డెంగీ నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, ఆరోగ్య పర్యవేక్షకులు సక్రి, పుష్పలీల, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

మాధవన్న ఆశయసాధనకు కృషి చేయాలి



నెహ్రూసెంటర్: మాధవన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: గోదావరి ప్రతిఘటన ఉద్యమంలో మాధవన్న త్యాగం గొప్పదని ఆయన ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న అన్నారు. మాధవన్న వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న, నాయకులు సామ పాలవయ్య, తెల్లబోయిన లక్ష్మయ్య, కృష్ణ, కవిత, కల్పన, సురేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి సూర్యం, యాకయ్య, సత్యం పాల్గొన్నారు.

బయ్యారం: మాధవన్న పాత్ర మరువలేనిదని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో మాధవన్న చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, భిక్షం, పుల్లన్న, రాకేష్, మురళి, యుగంధర్, నాగేశ్వరరావు, భీమ్లా, శేషు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం/తొర్రూరు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మాధవన్న, మారోజు వీరన్న వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో గురువారం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివారపు శ్రీధర్, బట్టు నాగేశ్వర్‌రావు, మిట్టగడుపుల వెంకన్న, బట్ట మేకల రాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి సరిత

నెల్లికుదురు: మండల న్యాయ సేవాధికార సంస్థను నిరుపేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ మట్ట సరిత తెలిపారు. మండంలోని కాచికల్ గ్రామంలో హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాలతో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమంలో జడ్జి సరిత మాట్లాడారు.రూ.3లక్షల లోపు ఆదాయం ఉన్న పేద ప్రజలు, మహిళలు, అంగవైకల్యం ఉన్న వ్యక్తులకు ఏమైన న్యాయ సమస్యలు వచ్చినప్పుడు కోర్టుకు వెళ్లలేని వారికి, డబ్బులు ఖర్చు పెట్టుకోలేని వారు మండల న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండి తమ జీవితాలను సంతోషంగా గడపాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.క్రాంతికిరణ్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఘనపురం రామకృష్ణ, ఏఓ రవీందర్‌రెడ్డి, న్యాయవాదులు వెంకన్న, అశోక్, ప్రవీణ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల పక్షాన పోరాడుతా..



ర్యాలీ నిర్వహించి మాట్లాడుతున్న అశోక్

మహబూబాబాద్ అర్బన్: నిరుద్యోగుల పక్షాన పోరాడుతాని వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిరుద్యోగులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. గ్రూప్ 1,2, 3, 4, పోలీస్ ఉద్యోగులను పెంచి, నూతన నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు చెల్లించాలని, 40శాతం పీఆర్సీ, ఫిట్‌మెంట్ అందించాలన్నారు. 317జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే చట్టసభలో అందరి తరఫున పోరాడుతానన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగులు సందీప్, ప్రవీణ్, శ్రీను, మహేష్, రాంబాబు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన సతీష్ అనే వ్యక్తి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ మేరకు కేసముద్రంస్టేషన్ గీతాంజలి హైస్కూల్‌కు చెందిన 1999–2000 ఎస్సెస్సీ పూర్వవిద్యార్థులు స్పందించి, రూ.10వేల ఆర్థికసాయాన్ని గురువారం అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, ధన్నసరి సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, కొండ్రెడ్డి యాకుబ్‌రెడ్డి, తాటికొండ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి

నెల్లికుదురు: నీడలేని నిరుపేద ప్రజలకు గూడు కల్పించిన మహానుబావుడు బోగ శ్రీరాములు అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న అన్నారు. గురవారం శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, భిక్షపతి, సంజీవ, రాములు, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: గూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వడ్డెరగూడెం ఫీడర్‌లో శుక్రవారం (నేడు) మరమ్మతులు పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రణీత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా అయోధ్యపురం సబ్‌స్టేషన్ పరిధిలోని రాజనపల్లి, పొనుగోడు గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కొండేటి అమ్ములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం హైదరాబాద్ గాంధీభవన్‌లో గురువారం నిర్వహించారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ మేకల వీరన్నయాదవ్ ఎన్నికలు జరిగిన తీరుపై మాట్లాడారు.

పరామర్శ..

గూడూరు: మండల కేంద్రంలో గత పది రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతిచెందిన గంప సామితేష్, అదే విధంగా కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్ తల్లి మృతి పట్ల బాధిత కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించాడు. కార్యక్రమంలో నాయకులు చిట్టి వెంకన్న, మాధవపెద్ది ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, రాసమల్ల యాకయ్య పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

కేసముద్రం: ఇనుగుర్తి మండలం చీన్యాతండా జీపీ శివారు ఐలయ్యబావి తండాలోని తాటిచెట్టును ఓ కౌలురైతు నిప్పంటించి కాలబెట్టాడని, ఇనుగుర్తికి చెందిన బాధిత గీతకార్మికుడు కూటికంటి యాకయ్య గురువారం ఒక ప్రకటనలో ఆరోపించాడు. సంబంధిత అధికారులు చట్టపరంగా అతడిపై చర్య తీసుకోవాలని ఆయన కోరాడు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



కేసముద్రం: విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని రంగాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అంకుస్‌అలీ అనే రైతు తన పంటభూమిలో దుక్కిదున్నేందుకు వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో పంటభూమి సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్‌తీగకు ఎద్దు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆ రైతు వేడుకున్నాడు.

నల్లెల గ్రామంలో ఆవు..

కురవి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని నల్లెల్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బండి సంతోష్ అనే రైతుకు చెందిన పాలిచ్చే ఆవు మేత కోసం ఊరి బయటకు వెళ్లింది. మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని బాధిత రైతు సంతోష్ తెలిపారు.

ప్రవేశాలు ప్రారంభం

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. కళాశాలలో బీఎస్సీ విభాగంలో డెయిరీ, సెరీకల్చర్, జనరల్, కంప్యూటర్స్, ఫిజికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ కోర్సుల్లో దోస్త్ విధానంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు సంబంధిత విద్యార్హత పత్రాలతో కళాశాలలో ప్రవేశం పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు 9989749066 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చిన్నగూడూరు: బీఆర్‌ఎస్ మండల కోఆప్షన్ మెంబర్ మోసిన్ బేగ్ గురువారం కాంగ్రెస్‌లో చేరాడు. మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల రాంరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరన్న, నాయకులు ప్రమోద్ రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

పోలీస్ కళాజాతా

గూడూరు: ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్‌లో వాడకం, గుట్కా, అంబర్, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు చేసిన వారి జీవితాలు అంధకారం అవుతుందని సీఐ కె. బాబూరావు, ఎస్సై సీహెచ్. నగేష్ అన్నారు. మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలో గురువారం రాత్రి చెడు వ్యసనాలపై పోలీసు కళాజాతా నిర్వహించారు.

ముగ్గురిపై దాడి

దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో గురువారం ముగ్గురు వ్యక్తులపై దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు.. బాధితులు కారుపోతుల వెంకటమ్మ, ఆమె భర్త కృష్ణయ్య, కృష్ణయ్య అన్న కుమారుడు నర్సయ్య కలసి కట్టెల కోసం వ్యవసాయం భూమి వద్దకు వెళ్లారు. ఈక్రమంలోనే అదే గ్రామానికి చెందిన పాలివాళ్లు కారుపోతుల సోమయ్య, ఐత కొండలయ్య, కారుపోతుల బద్రమ్మ, మోర భిక్షం, నందారపు సునీత, ఆమె భర్త రవి, ఆమె మామ నందారపు వెంకన్న ఆటోలో వచ్చి వారిపై గొడ్డళ్లతో దాడి చేశారు. కొన్ని సంవత్సరాలుగా భూమి విషయంలో వీరికి తగాదాలు ఉన్నాయి. దీనిపై పోలీస్‌స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేయగా గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయంపై స్థానిక ఎస్సై కరుణాకర్ ను వివరణ కోరగా పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకుంటామని తెలిపారు.

గాలివాన బీభత్సం

మరిపెడ రూరల్: మండలంలోని చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రూప్‌సింగ్‌తండాలో బుధవారం రాత్రి వీచిన గాలివానకు బానోతు రమేష్, శారదలకు చెందిన ఇంటి రేకులు లేచిపోయాయి. వర్షానికి ఇంట్లో ఉన్న బియ్యం, ధాన్యం, టీవీ, బీరువా, బట్టలు తడిసి ముద్దయ్యాయి. అదే విధంగా అదేతండాకు చెందిన అజ్మీర రమేష్, సైదమ్మలకు చెందిన ఇంటి ముందు సిమెంట్ రేకల షెడ్డు లేచిపోయింది. సిమెంట్ రేకులు విరికి మీద పడడంతో సైదమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబాలను మాజీ సర్పంచ్ పాక నాయక్, రాజు నాయక్ సందర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

తిరుగులేని శక్తిగా కాంగ్రెస్

దోర్నకల్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరంసోత్ జగదీష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతున్నామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉత్సాహంగా పని చేయాలని జగదీష్ కోరారు.

'కూలీలకు కనీస వేతనం అందడం లేదు'



మహబూబాబాద్ రూరల్: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సరైన వేతనాలు అందడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుర్ర మహేష్ అన్నారు. మండలంలోని గడ్డిగూడెం తండా ఎల్లమ్మ కుంటలో ఉపాధి పనులను పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయ మెంబర్ సెక్రటరీ రాజారావుకు గురువారం కుర్ర మహేష్ పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. కనీస పద్ధతి ప్రకారం కొలతలు పెట్టకుండా పనులు చేయించటం వల్ల కూలీలకు కనీస వేతనం రూ.300అందడంలేదన్నారు. పని ప్రదేశంలో కొలతలతో బ్యానర్ ఉండాలని, రేగడి మట్టిని రైతుల చేలకు పంపాలని, కూలీలకు తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వీరన్న, శంకర్, అంజయ్య, శ్రీను పాల్గొన్నారు.